భక్తి యోగం

# శ్రీచక్రము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని శ్రీ విద్యా సారధి వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) శ్రీ విద్యా సారధి వారి వెబ్ సైట్: http://srividyasaradhi.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో శ్రీ విద్యా సారధి వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul    Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## శ్రీ విద్యా సారధి వారి వెబ్ సైట్:

**http://srividyasaradhi.org/**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.




రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శ్రీచక్రము




కనకాభిషేకగ్రహీత, సువర్ణఘంటాకంకణ

శ్రీవిద్యానిధి, చక్రవిద, శ్రీవిద్యా రత్నాకర,

శ్రీవిద్యా విశారద

## డా॥ క్రోవి పార్థసారధి

# శ్రీచక్రము

ప్రథమ ముద్రణ : జనవరి, 2002

ప్రతులు : 1000

హక్కులు : క్రోవి మంజూషకు చెందుతాయి

**వెల : రూ. 12-00**

గ్రంథకర్త :
**కె. పార్థసారథి**
వాణిజ్యశాస్త్రోపన్యాసకులు
శాతవాహన కళాశాల
విజయవాడ.

ప్రాప్తి స్థానము :
**కె. మంజూష**
23-11/1-10/2, దేవీ నిలయం
ఓగిరాలవారి వీధి, సత్యనారాయణపురం,
విజయవాడ - 520 011.
ఫోన్స్ : 530672, 634571

ముద్రణ :
**నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
26-6-3, పాపయ్య వీధి,
గాంధీనగర్, విజయవాడ-3.
ఫోన్ : 0866 - 574828

# ప్రణతులు

శ్రీచక్రము అంటే ఏమిటి ? అందులో ఉండే దేవత ఎవరు ? అసలు శ్రీచక్రంలో ఎన్ని ఆవరణలు ఉన్నాయి ? వాటిపేర్లు ఏమిటి ? వాటిలో ఉండే దేవతలు ఎవరు?

శ్రీచక్రము ప్రకృతి పురుషుల సంగమస్థానము. ప్రకృతి పురుషులు అంటే శివశక్తులు, వారే కామేశ్వరి కామేశ్వరులు. అలాంటప్పుడు శ్రీచక్రంలో ఉండే ఆవరణలలో శివచక్రాలు ఎన్ని ? శక్తిచక్రాలు ఎన్ని ? వాటి ప్రాముఖ్యత ఏమిటి ? శ్రీచక్రంలో కోణాలు ఎన్ని ? సంధులు, మర్మస్థానాలు అంటే ఏమిటి ? అవి ఎన్ని ఉంటాయి ? శ్రీచక్రంలో బీజాక్షరాలుంటాయా ?

ప్రస్తారము అంటే ఏమిటి ? శ్రీచక్రం ఎన్ని ప్రస్తారాలుగా ఉంటుంది ? శ్రీచక్రంలో ఉండే తత్త్వాలు ఏవి ? శ్రీచక్రమనేది చరాచరజగత్తుకూ ప్రతీక అనేమాట నిజమేనా? శ్రీచక్రంలోని ఆవరణలు - మానవదేహంలోని షట్చక్రాలు ఒకటేనా ? అసలు మానవదేహమే శ్రీచక్రమా ? అదెలా సంభవం ?

శ్రీచక్రాన్ని పూజిస్తే వచ్చే ఫలితం ఏమిటి ?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే ఈ చిన్ని పుస్తకం. ఇందులో శ్రీచక్రాన్ని గురించి సమగ్రంగా వివరించటం జరిగింది.

మనదేశంలోని వారే కాకుండా ప్రపంచంలోని వారందరూ శ్రీచక్రాన్ని గురించి తెలుసుకునేందుకు వీలుగా ఈ గ్రంథాన్ని 'ఇంటర్నెట్' లో కూడా ఇవ్వటం జరుగుతోంది. ప్రస్తుతం దీన్ని తెలుగులో మాత్రమే అందించగలుగుతున్నాను. త్వరలోనే దీనిని హిందీ, ఇంగ్లీషు భాషలలో కూడా ఇవ్వటానికి ప్రయత్నిస్తాను.

శ్రీచక్రాన్ని గురించి ఎక్కువమంది తెలుసుకునేందుకు వీలుగా ఈ పుస్తకాన్ని అతి తక్కువధరలో విడుదలచేస్తూ, ఇంటర్నెట్‌లో కూడా అందిస్తున్నాను.

పండితులు, శ్రీవిద్యాపాసకులు, పరమేశ్వరిభక్తులు అందరూ నా యీ ప్రయత్నాన్ని మన్నించి నన్ను ఆశీర్వదింతురుగాక.

వృషనామ సంవత్సర
పుష్యశుద్ధ విదియ
మంగళవారం 15-1-2002

బుధజనవిధేయుడు
కోవి పార్థసారథి

# విషయసూచిక


| విషయము | పేజి |
|---|---|
| 1. పరిచయము | 5 |
| 2. తత్త్వాలు | 8 |
| 3. నవధాతువులు | 10 |
| 4. మానవదేహము - శ్రీచక్రము | 10 |
| 5. సంధులు, మర్మస్థానాలు | 13 |
| 6. కోణాలు | 14 |
| 7. బీజాక్షరాలు | 14 |
| 8. ప్రస్తారాలు | 15 |
| 9. నవావరణలు | 17 |
| 10. శ్రీచక్రపూజ | 24 |
| 11. పంచదశీ మహామంత్రము - శ్రీచక్రము | 25 |
| 12. పరమేశ్వరి పూజాఫలము | 30 |

# శ్రీచక్రము

## 1. పరిచయము

సకుంకుమ విలేపనా మళిక చుంబి కస్తూరికాం
సమందహసితేక్షణాం సశర చాప పాశాంకుశాం ।
అశేషజనమోహినీం అరుణమాల్య భూషాంబరాం
జపాకుసుమభాసురాం జపవిధౌ స్మరేదంబికాం ॥

నుదిటన కస్తూరికా తిలకము ధరించినది, చిరునగవు చిందించునది, పాశము, అంకుశము, ధనుర్బాణములు తన చేతులయందు ధరించి ఉండునది, ఈ లోకములోని జనులందరినీ సమ్మోహింపచేయునది, ఎఱ్ఱని వస్త్రములు ధరించినది, మంకెన్న పువ్వువలె పాటలవర్ణముతో ప్రకాశించునది అయిన ఆ పరమేశ్వరికి నమస్కరిస్తున్నాను.

ఇంతకీ ఎవరా పరమేశ్వరి ? .....ఆదిమధ్యాంతములు లేనటువంటిది, సృష్టి, స్థితిలయాలకు కారణమైనటువంటిది, సర్వజనులకు క్షేమము, శుభము కలుగచేయునది. అభయప్రదాయిని అయిన జగన్మాత, పరాత్పరి, లలితాత్రిపురసుందరి, రాజరాజేశ్వరి, భక్తుల కోర్కెలు తీర్చే దేవత, కోరిన వారి కొంగుబంగారం, ఆపన్నులపాలిట కల్పవృక్షం. ఆ దేవిని నమ్మినవారికి కష్టాలనేవి ఉండవు. తన చల్లనిచూపులతో ఎల్లవేళలయందు ఈ లోకాలను కాచి రక్షిస్తుంది. మరి ఆ దేవత ఎక్కడ ఉంటుంది ?

హ్రీంకారాసన గర్భితాం నలశిఖాం సౌః క్లీం కళాంభిభ్రతీమ్
సౌఃవర్ణాంబరధారిణీం వరసుధాం ధౌతాం త్రినేత్రోజ్వలామ్ ।
వందే పుస్తకపాశమంకుశధరాం స్రగ్భూషితాముజ్వలాం
త్వాంగౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్ర సంచారిణీం ॥

ఆ దేవత శ్రీచక్ర సంచారిణి - అంటే శ్రీచక్రంలో సంచరిస్తూ ఉంటుంది. శ్రీచక్ర రాజ నిలయ - శ్రీచక్ర మందే నివసిస్తుంది. శ్రీచక్రనగరసామ్రాజ్ఞి - శ్రీచక్రమనే మహానగరానికి సామ్రాజ్ఞి అంటే శ్రీచక్రమే ఆదేవి నివాసస్థానము అని చెప్పబడుతోంది. శ్రీచక్రము అంటే... శివశక్తుల విహారస్థానము. ఇది 9 భాగాలుగా ఉంటుంది. వాటినే విడివిడిగా చక్రాలు అని, ఆవరణలు అని అంటారు.

**బిందుత్రికోణ వసుకోణ దశారయుగ్మ**
**మన్వస్రనాగదళ షోడశపత్రయక్తం ।**
**వృత్తత్రయంచ ధరణీ సదన త్రయంచ**
**శ్రీచక్రరాజ ఉదితః పరదేవతాయాః ॥**

శ్రీచక్రంలో బిందువు, త్రికోణము, అష్టకోణము, దశారయుగ్మము, చతుర్దశకోణము, అష్టదళము, షోడశదళము, వృత్తత్రయము, భూపురత్రయము ఉంటాయి. వాటిలో కొన్ని శివచక్రాలు, కొన్ని శక్తిచక్రాలు, బైరవయామళంలో చెప్పినట్లు.

**చతుర్భి శ్శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః ।**
**శివశక్త్యాత్మకంజ్ఞేయం శ్రీచక్రం శివయోర్వపుః ॥**

4 శివచక్రాలు, 5 శక్తిచక్రాలు వెరసి 9 చక్రాలతో శ్రీచక్రము శివశక్తుల స్వరూపమై ఉన్నది. అంటే శ్రీచక్రంలో శివచక్రాలు 4, శక్తిచక్రాలు 5 ఉన్నాయి. అయితే శక్తిచక్రాలు ఏవి ? శివచక్రాలు ఏవి ? శక్తిచక్రాలన్నీ కోణాకారంగానే ఉంటాయి.

**త్రికోణ మష్టకోణంచ దశకోణద్వయం తథా ।**
**చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచచః ॥**

త్రికోణము, అష్టకోణము, దశకోణద్వయము. అంటే పదికోణములు గల చక్రాలు రెండు 1. అంతర్దశారము, 2. బహిర్దశారము తరువాత చతుర్దశారము 14 కోణములు గల చక్రము ఈ 5 శక్తిచక్రాలు.

**బిందుశ్చాష్టదళంపద్మం పద్మం షొడశపత్రకమ్ ।**
**చతురస్రంచ చత్వారి శివచక్రాణ్యనుక్రమాత్ ॥**

బిందువు, అష్టదళపద్మము, షోడశదళపద్మము, చతురస్రము ఈ 4 శివచక్రాలు.

శక్తిచక్రాలన్నీ కోణాకారంలో ఉంటాయి. కాని శివచక్రాలు 8 దళాలు, 16 దళాలు గల పద్మాలు, బిందువు, చతురస్రము. ఈ చతురస్రము 3 రేఖలుగా ఉంటుంది. ఈ రకంగా శ్రీచక్రంలో మొత్తం 9 చక్రాలున్నాయి.

అయితే ఈ చక్రాలు విడివిడిగా ఉన్నాయా అంటే లేవు. ఈ చక్రాలు విడివిడిగా ఉండటము హిందూ కుటుంబవ్యవస్థకు వ్యతిరేకం అందుకని కలిసేఉంటాయి. శక్తిచక్రాలకు రెండువైపులా శివచక్రాలుంటాయి. ఒకవైపు బిందువు. రెండవవైపు

చతురస్రము, అష్టదళము, షోడశదళము ఉంటాయి. అంతేకాకుండా శివ శక్తి చక్రాలు ఒకదానితో ఒకటి అవినాభావసంబంధం కలిగిఉంటాయి.

**త్రికోణేబైందవమ్ శ్లిష్టమ్ అష్టారేష్టదళాంబుజమ్ ।**
**దశారయో ష్షోడశారమ్ భూగృహమ్ భువనాశ్రకే ॥**

| | | |
|---|---|---|
| త్రికోణమునందు | - | బిందువు |
| అష్టకోణమునందు | - | అష్టదళపద్మము |
| దశారయుగ్మమునందు | - | షోడశదళపద్మము |
| చతుర్దశారము నందు | - | భూపురము |

సంయోగము చెంది ఉంటాయి. ఈవిధంగా శివ శక్తి చక్రాలు సంయోగం చెందటం హిందూకుటుంబవ్యవస్థకు ప్రతీక.

శ్రీచక్రంలో మొత్తం 9 చక్రాలున్నాయి. వాటినే ఆవరణలు అనికూడా అంటారు అని చెప్పుకున్నాం. వాటన్నింటికీ విడివిడిగా పేర్లున్నాయి.

1. **ప్రథమావరణ :** దీన్నే భూపురము అంటారు. దీనిలో మూడురేఖలు ఉంటాయి. దీన్ని త్రైలోక్యమోహన చక్రము అంటారు.
2. **రెండవ ఆవరణ :** షోడశదళము. పదహారుదళాలు గల పద్మము. దీన్ని సర్వాశాపరిపూరక చక్రము అంటారు.
3. **మూడవ ఆవరణ :** అష్టదళము. ఎనిమిది దళాలు గల పద్మము. దీన్ని సర్వసంక్షోభణ చక్రము అంటారు.
4. **నాల్గవ ఆవరణ :** చతుర్దశారము పధ్నాలుగు కోణాలు గల చక్రము. దీన్ని సర్వసౌభాగ్యదాయిక చక్రము అంటారు.
5. **ఐదవ ఆవరణ :** బహిర్దశారము పది కోణాలు గల చక్రము. దీన్ని సర్వార్థసాధక చక్రము అంటారు.
6. **ఆరవ ఆవరణ :** అంతర్దశారము పది కోణాలు గల చక్రము. దీన్ని సర్వరక్షాకర చక్రము అంటారు.
7. **ఏడవ ఆవరణ :** అష్టకోణము ఎనిమిది కోణాలు గల చక్రము. దీన్ని సర్వరోగహర చక్రము అంటారు.

8. **ఎనిమిదవ ఆవరణ :** త్రికోణము. మూడు కోణాలు గల చక్రము. దీన్ని సర్వసిద్ధిప్రద చక్రము అంటారు.

9. **తొమ్మిదవ ఆవరణ :**బిందువు. దీన్ని సర్వానందమయ చక్రము అంటారు.

శ్రీచక్రంలో మూడువృత్తాలు ఉంటాయి. ఇవి ఎక్కడ ఉంటాయి. అనే విషయంలో సంప్రదాయ భేదం ఉన్నది. ఒక సంప్రదాయం ప్రకారము మూడు వృత్తాలు ఒకేచోట ఉంటాయి. కాని ఇంకొక సంప్రదాయం ప్రకారము మూడు వృత్తాలు విడివిడిగా ఉంటాయి. అంటే

| | | |
|---|---|---|
| భూపురానికి, షోడశదళానికి మధ్యన | – | ఒకటి |
| షోడశదళానికి, అష్టదళానికి మధ్యన | – | ఒకటి |
| అష్టదళానికి, చతుర్దశారానికి మధ్యన | – | ఒకటి |

ఉంటాయి. ఇది కేవలము సంప్రదాయభేదము. అంతేకాని వేరుకాదు.

## 2. తత్త్వాలు

ఇప్పటిదాకా శ్రీచక్రంలో ఉండే వివిధ చక్రాలను చూశాం. ఇప్పుడు అందులో ఉండే తత్త్వాలు ఏమిటో చూద్దాం. తత్త్వము అంటే స్వభావము నిజస్థితి, వస్తువు అని అర్థం. శ్రీచక్రము అనేది కేవలము రేఖానిర్మితమేనా ? లేకపోతే అందులో ఏమైనా తత్త్వాలు కూడా ఉన్నాయా ? అనే విషయాన్ని గనక ఒక్కసారి పరిశీలించినట్లైతే... ఈ జగత్తును సృష్టించటానికి అవసరమైన స్వభావాలన్నీ శ్రీచక్రంలో ఇమిడి ఉన్నాయి. అసలు తత్త్వాలు ఎన్ని ? అన్నప్పుడు 51 అని, 36 అని భిన్నాభిప్రాయాలున్నాయి. అయితే వీటన్నింటినీ క్రోడీకరించి శంకరభగవత్పాదులవారు శివదాది క్షితిపర్యంతము తత్త్వాలు 25 అని తేల్చారు. గౌడపాదులవారు తమ సుభగోదయస్తుతిలో వీటిగురించి వివరిస్తూ.....

**పృథివ్యాపస్తేజః పవన గగనే తత్ప్రకృతయః**
**స్థితా స్తన్మాత్రాస్తా విషయదశకం మానసమితి ।**
**తతో మాయా విద్యా తదనుచ మహేశః శివ ఇతి**
**పరం తత్త్వాతీతం మిలిత వపురిందోః పరకళా ॥**

పంచభూతాలు, తన్మాత్రలు, ఇంద్రియాలు, మనస్సు, మాయాదులు కలిసి 25 తత్త్వాలవుతున్నాయి. మాయాదులు అంటే మాయ, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు.

మహేశ్వరునితో కలిసిన మాయ జీవభావం పొందుతుంది. హిరణ్యగర్భుడు అనే సదాశివునితో కలిసిన శుద్ధవిద్య సాదాఖ్యకళ అవుతుంది. అదే 26వ తత్త్వము. ఈ తత్త్వాలన్నీ శ్రీచక్రంలో ఉన్నాయి. ఇవే జగన్నిర్మాణానికి హేతువులు. ఇవన్నీ శ్రీచక్రంలో ఉన్నాయి కాబట్టే శ్రీచక్రము చరాచర జగత్తుకూ ప్రతీక అని చెప్పబడుతోంది.

**శ్రీచక్రం త్రిపురసుందర్యా బ్రహ్మాండాకార మీశ్వరీ ।**

ఓ పరమేశ్వరీ । శ్రీచక్రమంటే సామాన్యమైన ఒక యంత్రం కాదు. అది బ్రహ్మాండానికి ప్రతీక. ఎందుచేతనంటే బ్రహ్మాండంలో ఉన్న తత్త్వాలన్నీ శ్రీచక్రంలోనే ఉన్నాయి.

**పంచభూతాత్మకం చైవ తన్మాత్రాత్మక మేవచ ।**

సృష్టికి మూలకారణమైనవి పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము. వీటియొక్క లక్షణాలే తన్మాత్రలు శబ్ద స్పర్శరూపరస గంధాలు. వీటియొక్క కలయికతోనే బ్రహ్మాండము సృష్టించబడుతోంది. అటువంటి పంచభూతాల, తన్మాత్రల యొక్క తత్త్వాలన్నీ శ్రీచక్రంలోనే ఉన్నాయి. అందుకే శ్రీచక్రము బ్రహ్మాండానికి ప్రతీక. అంతేకాదు.

**ఇంద్రియాత్మక మేవంచ మనస్తత్త్వాత్మకం తథా ।**

ఇంద్రియాలు అంటే జ్ఞానేంద్రియాలు - 5, కర్మేంద్రియాలు - 5 వెరసి 10. జగత్తులోని ప్రాణికోటికంతటికీ ఈ ఇంద్రియాలుంటాయి. ఆహారనిద్రామైథునాలు వీటన్నింటికీ సామాన్యము. ఈ 10 ఇంద్రియాల తత్త్వాలు శ్రీచక్రంలో ఉండటంవల్ల, శ్రీచక్రం సృష్టిలోని ప్రాణికోటికంతటికీ ప్రతీక అవుతోంది. **మనస్తత్త్వాత్మకంతథా.** ఇక మానవులను ఆలోచింప చేసేది మనస్సు. యుక్తాయుక్త విచక్షణ కలుగచేసేది మనస్సు. ఇది మానవులకు మాత్రమే ఉంది. ఈ మనస్సు యొక్క తత్త్వము కూడా శ్రీచక్రంలోనే ఉన్నది. కాబట్టి శ్రీచక్రము ఈ విశాలవిశ్వంలో ఉన్న మానవాళికంతటికీ ప్రతీక. అందుకే శ్రీచక్రాన్ని గనకఅర్చించినట్లైతే చరాచరజగత్తునూ అర్చించినట్లే, విశ్వమానవాళినంతటిని అర్చించినట్లే, జగత్తులోని ప్రాణికోటినంతటినీ అర్చించినట్లే.

ఇవేకాక మాయా, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు అను తత్త్వాలు. వెరసి 25 తత్త్వాలు శ్రీచక్రంలో ఉన్నాయి. 26వ తత్త్వమే సాదాఖ్యకళ.

## 3. నవధాతువులు

అంతదాకా ఎందుకు ? శ్రీచక్రము, మానవదేహము రెండూ ఒకటే. మానవదేహము నవధాతువులతో నిర్మించబడింది. అవి 1. చర్మము, 2. రక్తము, 3. మాంసము, 4. మెదడు, 5. ఎముకలు, 6. మజ్జ, 7. వీర్యము, 8. ప్రాణము, 9. జీవము. ఈ 9 ధాతువులు శ్రీచక్రంలోని 9 ఆవరణలకు ప్రతీక. అలాగే శ్రీచక్రంలో ఉన్న 9 ఆవరణలు మానవదేహంలోని నవరంధ్రాలకు ప్రతీక, నవధాతువులలోనుకూడా శ్రీచక్రంలో శివశక్తి చక్రాలున్నట్లుగానే, శివశక్తి ధాతువులున్నాయి.

**త్వక్ సృగ్ మాంస మేదోస్తి ధాతవశ్శక్తి మూలకాః ।**
**మజ్జా శుక్ల ప్రాణ జీవ ధాతవ శ్శివమూలకాః ॥**

చర్మము, రక్తము, మాంసము, మెదడు, ఎముకలు ఈ 5 శక్తిధాతువులు కాగా మజ్జ, శుక్లము, ప్రాణము, వీర్యము - 4 - శివధాతువులు.

**నవధాతురయం దేహో నవయోనిసముద్భవః ।**

ఈ తొమ్మిది ధాతువులతో కూడి ఉన్న ఈ శరీరము నవయోన్యాత్మకమై ఉన్నది. ఈ రకంగా శ్రీచక్రంలోని నవావరణలు, నవధాతువులకు ప్రతీక. అంతేకాదు, మానవశరీరంలోని వివిధ భాగాలు శ్రీచక్రంలోని వివిధ ఆవరణలకు ప్రతీక.

## 4. మానవదేహము - శ్రీచక్రము

శ్రీచక్రంలోని నవావరణలను మానవశరీరంలోని వివిధ భాగాలతో పోల్చటం జరిగింది.

**బైందవమ్ బ్రహ్మరంధ్రంచ, మస్తకంచ త్రికోణకమ్**
**లలాటేష్టారపత్రంచ భృవోర్మధ్యే దశారకమ్**
**బహిర్ధశారం కంఠేతు మన్వశ్రం హృదయం భవేత్**
**నాభౌచ వసుపత్రంచ, కట్యాం షోడశపత్రకమ్**
**వృత్తత్రయంచ ఊరుభ్యాం, పద్భ్యాంభూపురత్రయమ్ ॥**

| | | | |
|---|---|---|---|
| బైందవమ్ బ్రహ్మరంధ్రంచ | బిందువు | - | బ్రహ్మరంధ్రము |
| మస్తకంచ త్రికోణకమ్ | త్రికోణము | - | తలముందు భాగము |

| | | | |
|---|---|---|---|
| లలాటేష్టార పత్రంచ | అష్టకోణము | - | లలాటము |
| భృవోర్మధ్యే దశారకమ్ | అంతర్దశారము | - | భ్రూమధ్యము |
| బహిర్దశారం కంఠేతు | బహిర్దశారము | - | కంఠము |
| మన్వస్రంచ హృదయం భవేత్ | చతుర్దశారము | - | హృదయము |
| నాభౌచ వసుపత్రంచ | అష్టదళపద్మము | - | నాభి |
| కట్యాం షోడశపత్రకమ్ | షోడశదళము | - | కటిప్రదేశము |
| వృత్తత్రయంచ ఊరుభ్యాం | వృత్తత్రయము | - | ఊరువులు |
| పద్భ్యాం భూపురత్రయమ్ | భూపురము | - | పాదాలు. |

అంతేకాకుండా మానవదేహంలో షట్చక్రాలున్నాయి. అవి : 1. మూలాధరము 2. స్వాధిష్ఠానము 3. మణిపూరము 4. అనాహతము 5. విశుద్ధిచక్రము 6. ఆజ్ఞాచక్రము. 7. సహస్రారము. వీటిలో

**మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం**
**స్థితం స్వాధిష్ఠానే హృదిమరుత మాకాశముపరి**
**మనోపి భ్రూమధ్యే సకలమపిభిత్త్వాకులపథం**
**సహస్రారే పద్మే ॥**

| | | |
|---|---|---|
| మూలాధారచక్రము | - | భూ తత్వాత్మకము |
| స్వాధిష్ఠానము | - | అగ్ని తత్వాత్మకము |
| మణిపూరము | - | జల తత్వాత్మకము |
| అనాహతము | - | వాయు తత్వాత్మకము |
| విశుద్ధి చక్రము | - | అకాశ తత్వాత్మకము |
| ఆజ్ఞా చక్రము | - | మనస్తత్వాత్మకము. |
| వీటన్నింటిపైనా ఉండేది | - | సహస్రదళపద్మము |

అయితే శరీరంలో ఇవి ఎక్కడ ఉంటాయి అన్నప్పుడు

**మూలాధారం గుదస్థానం, స్వాధిష్టానంతుమేహనమ్**
**నాభిస్తు మణిపూరాఖ్యమ్ హృదయంచాబ్జమనాహతమ్ ।**
**తాలుమూలం విశుద్ధాఖ్యం ఆజ్ఞాంచ నిటలాంబుజమ్**
**తస్మాదూర్ధ్వమధోముఖమ్ వికశితమ్ పద్మం సహస్రచ్ఛదమ్ ॥**

ఆధారచక్రము - గుదస్థానములో ఉన్నది
స్వాధిష్ఠానము - లింగస్థానములో ఉన్నది
మణిపూరము - నాభిస్థానములో ఉన్నది
అనాహతము - హృదయస్థానములో ఉన్నది
విశుద్ధిచక్రము - కంఠస్థానములో ఉన్నది
ఆజ్ఞాచక్రము - భృకుటిస్థానములో ఉన్నది

శ్రీచక్రంలోని నవావరణలకు, మానవశరీరంలోని షట్చక్రాలకు ఐక్యతచెప్పబడింది. దీన్నే నాదబిందు ఐక్యత అంటారు. నాదము అంటే శ్రీచక్రము, బిందువు అంటే షట్చక్రాల సమూహము. గౌడపాదులవారు తమ సుభగోదయస్తుతిలో

**త్రికోణం చాధారం, త్రిపుర వినుతే ష్టార మనఘే**
**భవేత్స్వాధిష్ఠానమ్, పునరపి దశారమ్ మణిపురమ్ ।**
**దశారం తే సంవిత్కమల, మథ మన్వస్రక్రముమే**
**విశుద్ధం, స్యాదాజ్ఞా శివఇతి, తతో బైందవగృహమ్ ॥**

శ్రీచక్రంలోని నవావరణలకు, మానవదేహంలోని షట్చక్రాలకు ఐక్యత ఈ విధంగా ఉన్నది.

1. ఆధారచక్రానికి - త్రికోణంతో ఐక్యత
2. స్వాధిష్ఠానానికి - అష్టకోణంతో ఐక్యత
3. మణిపూరానికి - అంతర్దశారంతో ఐక్యత
4. అనాహతానికి - బహిర్దశారంతో ఐక్యత
5. విశుద్ధి చక్రానికి - చతుర్దశారంతో ఐక్యత
6. ఆజ్ఞా చక్రానికి - శివచక్రాలయిన అష్టదళము షోడశదళములతో ఐక్యత
7. సహస్రారానికి - చతుర్ద్వార సహితమైన భూగృహంతో ఐక్యత

చెప్పబడింది. అయితే ఈ విషయంలో కౌళసమయాచారులకు బేధమున్నది. ఇప్పుడు చెప్పినది సమయాచార ప్రకారం ఐక్యత కాగా కౌళాచారుల ప్రకారం ఈ ఐక్యత వేరుగా చెప్పబడుతోంది.

1. ఆధారచక్రానికి - భూపురంతో ఐక్యత
2. స్వాధిష్ఠానానికి - చతుర్దశారంతో ఐక్యత

3. మణిపూరానికి - బహిర్దశారంతో ఐక్యత

4. అనాహతానికి - అంతర్దశారంతో ఐక్యత

5. విశుద్ధి చక్రానికి - అష్టకోణంతో ఐక్యత

6. ఆజ్ఞా చక్రానికి - త్రికోణంతో ఐక్యత

7. సహస్రారానికి - బిందువుతో ఐక్యత

ఈ రకంగా షట్చక్రాలకు, శ్రీచక్రంలోని నవావరణలకు ఐక్యత చెప్పబడింది. అంటే... శ్రీచక్రము అనేది మానవదేహమే కాని వేరుకాదు. అందుకే శ్రీచక్రాన్ని గురించి చెప్పేటప్పుడు.

**శ్రీచక్రం త్రిపురసుందర్యా బ్రహ్మాండాకార మీశ్వరీ**
**పంచభూతాత్మకంచైవ తన్మాత్రాత్మకమేవచ ।**
**ఇంద్రియాత్మక మేవంచ మనస్తత్వాత్మకం తథా**
**మాయాది తత్వరూపంచ తత్వా తీతంచ బైందవమ్ ॥**

శ్రీచక్రమనేది కేవలము ఒక సామాన్యమైన దేవతా యంత్రం కాదు. అది చరాచర జగత్తుకూ ప్రతీక. విశ్వమానవాళికి ప్రతీక. జగత్తులోని ప్రాణికోటికి ప్రతీక. కాబట్టి శ్రీచక్రాన్ని గనక పూజించినట్లైతే చరాచరజగత్తును పూజించినట్లే, జగత్తులోని ప్రాణికోటినంతటినీ పూజించినట్లే, విశ్వమానవాళినంతటినీ పూజించినట్లే.

## 5. సంధులు - మర్మస్థానాలు

శ్రీచక్రంలో మర్మస్థానాలు 28, సంధులు 24 ఉంటాయి. అసలు సంధి అంటే ఏమిటి ?

**ద్విరేఖా సంగమస్థానం సంధి రిత్యభిధీయతే**

రెండురేఖలు కలిసేచోటును × సంధి అంటారు. అలాగే

**త్రిరేఖా సంగమస్థానం మర్మం మర్మవిదోవిదుః**

మూడురేఖలు కలసినచోటును ⋇ మర్మస్థానము అంటారు. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమంటే మర్మస్థానాలు, సంధులు అన్నీ శ్రీచక్రంలోని కోణాల యందు మాత్రమే ఉంటాయి. అందుచేతనే

**మన్వస్ర ద్విదశార అష్టకోణ వృత్త చతుష్టయమ్ ।**
**అష్టావింశతి మర్మాణి చతుర్వింశతి సంధియః ॥**

మన్వస్రము, దశారయుగ్మము, అష్టకోణము అనే 4 చక్రములందు 28 మర్మస్థానాలు, 24 సంధులు ఉంటాయి. కాని శ్రీచక్రాన్ని గీసి లెక్కపెట్టినట్లైతే మర్మస్థానాలు 24 మాత్రమే ఉంటాయి. అయితే శివచక్రాలకు సంగమస్థానములు లేకపోయినప్పటికీ వాటిని కూడా మర్మస్థానాలుగానే లెక్కపెట్టాలి. అప్పుడు మర్మస్థానాలు 24+4=28 అవుతాయి.

## 6. కోణాలు

శ్రీచక్రంలో శక్తిచక్రాలన్నీ కోణాకారంలోనే ఉంటాయి అని చెప్పుకున్నాం కదా. మరి శ్రీచక్రం మొత్తం మీద ఎన్నికోణాలుంటాయి ? అంటే

| | | |
|---|---|---|
| త్రికోణంలో | - | 3 |
| అష్టకోణంలో | - | 8 |
| అంతర్దశారంలో | - | 10 |
| బహిర్దశారంలో | - | 10 |
| చతుర్దశారంలో | - | 14 |
| మొత్తం కోణాలు | - | 45 |

## 7. బీజాక్షరాలు

శ్రీచక్రము కేవలము రేఖానిర్మితము, ఇందులో ఏ దేవత పేరుగాని, మంత్రంగాని ఉండవు. అయితే బీజాక్షరాలుంటాయా ? అనేది ప్రశ్న. ఇక్కడ సంప్రదాయ బేధమున్నది.

**బీజాక్షరయుతం చక్రం యతీనాముత్త మోత్తమం ।**
**బీజాక్షరవిహీనంతు గృహస్తానాం ప్రశస్తకమ్ ॥**

బీజాక్షరాలున్న శ్రీచక్రము యతీశ్వరులకు ఉత్తమమైనది. బీజాక్షరాలులేని శ్రీచక్రము గృహస్తులకు ప్రశస్థమైనది. ఇంకొక సంప్రదాయం ప్రకారము

**బీజం వినాతునిర్జీవం । శవవత్పరికీర్తితమ్**
**బీజహీనంతుయచ్చక్రం । తచ్చక్రమ్ సిద్ధిదంనచ**

బీజాక్షరములులేని శ్రీచక్రము ప్రాణములేని దానితో సమానము. బీజాక్షరములులేని శ్రీచక్రపూజ నిరర్ధకము, అది సిద్ధించదు. ఇది సంప్రదాయబేధము. ఈ రకంగా సంప్రదాయబేధాలున్నప్పుడు గురుసంప్రదాయాన్నే పాటించాలనేది ఆర్యోక్తి.

## 8. ప్రస్తారాలు

ఇప్పుడు శ్రీచక్రంలోని ప్రస్తారాలను చూద్దాం. శ్రీచక్రము ఉండే ఆకారాన్ని ప్రస్తారము అంటారు. ఇది మూడురకాలుగా ఉంటుంది అని శ్రీవిద్యార్ణవతంత్రంలో చెప్పబడింది.

**ప్రస్తారో త్రివిధా ప్రోక్తః శ్రీచక్రస్య తథేశ్వరీ ।**
**మేరు కైలాస భూసంజ్ఞా బేధాస్య త్రిధాభవేత్ ॥**

శ్రీచక్రం మూడు ప్రస్తారాలుగా ఉంటుంది. అవి

1. **భూప్రస్తారము :** ఇది బల్లపరుపుగా ఉంటుంది. రాగి, వెండి, బంగారు రేకుల మీదగాని, పట్టువస్త్రము, భూర్జరీపత్రము, చివరకు నేలమీదగాని శ్రీచక్రాన్ని గీసి పూజిస్తారు. ఇందులో యంత్రము యొక్క పొడవు, వెడల్పులు సమానంగా ఉంటాయి.

2. **మేరు ప్రస్తారము :** ఇది బోర్లించిన గరాటులాగా ఉంటుంది. ఆవరణలన్నీ ఒకదాని మీద ఒకటిగా, మొత్తం 9 అంతస్తులుగా ఉంటాయి. ఇందులో యంత్రము యొక్క పొడవు, వెడల్పు ఎత్తు సమానంగా ఉంటాయి. 3×3×3 అంగుళాలు.

3. **కైలాస ప్రస్తారము :** ఇది కూడా మేరువులాగానే ఉంటుంది. ఇందులో పొడవు, వెడల్పు సమానంగానే ఉంటాయి. కాని ఎత్తు మాత్రం 1/4 వంతు ఉంటుంది. 4×4×1

అసలు ఈ ప్రస్తారాలలో ప్రత్యేకత ఏమిటి ? అంటే.....

**మేరు ప్రస్తారకం యంత్రం నిత్యా తాదాత్మ్యకంస్మృతం**
**మాతృకా యస్తు కైలాస ప్రస్తారాఖ్యా సురేశ్వరి**
**భూప్రస్తారం మహాదేవి వశిన్యాత్మక ముత్తమమ్ ॥**

1. భూప్రస్తారంలో - వశిన్యాది దేవతల తాదాత్మ్యము చెప్పబడింది.
2. మేరు ప్రస్తారంలో - షోడశనిత్యల తాదాత్మ్యము చెప్పబడింది.
3. కైలాస ప్రస్తారంలో - మాతృకా తాదాత్మ్యం చెప్పబడింది.

మాతృకలు అంటే అక్షరాలు. అకచటతపయశ వర్గులు. శక్తిసంగమతంత్రంలో శ్రీచక్రంలోని మూడు ప్రస్తారాలలోనూ మళ్ళీ బేధము చెప్పబడింది.

భూప్రస్తారో ద్వివిధాదేవీ । పాతాళోర్థ్వక్రమేణతు
కైలాసాఖ్యస్తుప్రస్తారో । ద్వివిధ ప్రకీర్తి తః ।
అర్థకైలాస సంజ్ఞస్తు । పూర్ణ కైలాసకస్త థా
తద్వైన మేరు ప్రస్తారః । కీర్తితస్తు మయాతవ ॥

1. భూప్రస్తారము రెండు రకాలుగా ఉంటుంది.

   **1. ఊర్థ్వభూ ప్రస్తారము :** రేకు మీద యంత్రాన్ని గీసినప్పుడు గీతలు ఉబ్బెత్తుగా కనిపిస్తాయి.

   **2. పాతాళ భూప్రస్తారము :** రేకు మీద యంత్రం గీసినప్పుడు గీతలు లోతుగా వస్తాయి.

2. మేరు ప్రస్తారము రెండు రకాలుగా ఉంటుంది.

   **1. అర్థ మేరువు :** ఇందులో అష్టదళము వరకు అంటే 3 ఆవరణలు మాత్రమే అంతస్తులుగా ఉండి తరువాతవన్నీ బల్లపరుపుగా ఉంటాయి.

   **2. పూర్ణ మేరువు :** మొత్తం 9 ఆవరణలూ అంతస్తులుగానే ఉంటాయి.

3. కైలాస ప్రస్తారము ఇది కూడా అర్థ కైలాసము, పూర్ణ కైలాసము అని రెండు రకాలుగా ఉంటుంది. అర్థకైలాసము అర్థ మేరువులానే ఉంటుంది. పూర్ణ కైలాసము పూర్తిగా అంతస్తులుగా ఉంటుంది. వాడుకలో ఇవే కాకుండా ఇంకా అనేకరకాలైన చక్రాలున్నాయి.

   **1. భూప్రస్తారంలో 12 దళాలున్న చక్రము :** అష్టదళము, షోడశదళముల మధ్య ద్వాదశ దళముంటుంది. ఇది ద్వాదశాదిత్యులకు ప్రతీక.

   **2. భూప్రస్తారంలో 32 దళాలున్న చక్రము :** ఇవి భూపురం తరువాత ఉంటాయి. షోడశి మహాయంత్రంలోని 16 అక్షరాలలోని శివశక్తి రూపాలకు ఇవి ప్రతీక.

   **3. మేరు ప్రస్తారం ఊర్ధ్వదళము :** ఇందులో దళాలు పైకి చూస్తుంటాయి.

   **4. మేరు ప్రస్తారం అధోదళము :** ఇందులో దళాలు క్రిందికి చూస్తుంటాయి.

   **5. కూర్మ ప్రస్తారము :** మేరువు కూర్మము మీద ఉంటుంది.

   **6. శివకామేశ్వరము :** ఇది శివలింగం పైన చెక్కిన మేరువు.

ఈ రకంగా అనేక రకాలయిన శ్రీచక్రాలు వాడుకలో కనిపిస్తుంటాయి.

# 9. నవావరణలు

ఆవరణ అంటే ప్రాకరము అని అర్థం శ్రీచక్రంలో శివచక్రాలు 4, శక్తిచక్రాలు 5 వెరసి 9 చక్రాలున్నాయి. వీటినే 'నవావరణలు' అంటారు. వీటిలో ప్రతి ఆవరణకు కొన్నిదళాలు లేదా కోణాలు ఉంటాయి. శ్రీచక్రానికి ఆదిదేవత పరమేశ్వరిపరమేశ్వరులు. వారే శివశక్తులు. శ్రీచక్రంలోని ఆవరణలను రత్నాయరుషి తన ఆవరణ దేవతాస్తుతిలో వివరించాడు.

త్రైలోక్యమోహనం వందే । సర్వాశాపరిపూరకమ్
సర్వసంక్షోభణం చక్రం । సర్వసౌభాగ్యదాయకమ్
సర్వార్థసాధకం చక్రం । సర్వరక్షాకరమ్ పరమ్
సర్వరోగహరం చక్రం । సర్వసిద్ధి ప్రదాయకమ్
సర్వానందమయంచక్రం ఇతి చక్రక్రమం భజే ॥

శ్రీచక్రాన్ని వర్ణించేటప్పుడు బిందువు నుండి మొదలుపెట్టి భూపురానికి రావటం సంప్రదాయం. ఇది సృష్టిక్రమము.

**బిందు త్రికోణ కాష్టావతారయుగ లోకకోణ వృత్తయుతమ్**
**వసుదళవృత్త కళాదళవృత్త త్రిమహీగృహం భజే చక్రమ్ ॥**

శ్రీచక్రంలో బిందువు, త్రికోణము, అష్టకోణము, దశారయుగ్మము, చతుర్దశారము, అష్టదళము, షోడశదళము, భూపురము అనే ఆవరణలున్నాయి. ఇవి వరుసగా :

1. భూపురము – త్రైలోక్యమోహన చక్రము
2. షోడశదళము – సర్వాశాపరిపూరక చక్రము
3. అష్టదళము – సర్వసంక్షోభణ చక్రము
4. చతుర్దశారము – సర్వసౌభాగ్యదాయక చక్రము
5. బహిర్దశారము – సర్వార్ధసాధక చక్రము
6. అంతర్దశారము – సర్వరక్షాకర చక్రము
7. అష్టకోణము – సర్వరోగహర చక్రము
8. త్రికోణము – సర్వసిద్ధిప్రద చక్రము
9. బిందువు – సర్వానందమయ చక్రము

నవావరణలను చెప్పేటప్పుడు వృత్తాలను అందులో చేర్చలేదు. వీటికి పూజకూడా లేదు.

**1. ప్రథమావరణ :** దీన్ని త్రైలోక్యమోహన చక్రము అంటారు. ఇది లకార ప్రకృతికము. భూతత్త్వాత్మకము. ఇందులో మూడు రేఖలుంటాయి. ఈ మూడురేఖలు భూలోక భువర్లోక సువర్లోకాలకు ప్రతీక. అవి శుక్ల, పీత, అరుణ (తెలుపు, పసుపు, ఎరుపు) వర్ణాలలో ఉంటాయి. ఈ ఆవరణకు 4 ద్వారాలుంటాయి. ఆ 4 ద్వారాలు 4 వేదాలకు ప్రతీక. ఈ ద్వారాలలోకి గనక ప్రవేశించగలిగినట్లైతే పరదేవత సాక్షాత్కారం కలుగుతుంది.

**శ్రీచక్రస్యచత్వారిద్వారిణి చతుర్వేద రూపాణి ।**
**ద్వారప్రవేశ నైవభవతి పరదేవతా సాక్షాత్కారః ॥**

ఈ చక్రాన్ని అర్చించినవారు ముల్లోకాలను సమ్మోహింప చేయగలుగుతారు. ఈ ఆవరణలోని 3 రేఖలలోను విడివిడిగా దేవతలున్నారు. ఇప్పుడు ఆ రేఖలలోకి ప్రవేశిద్దాం. ముందుగా **శుక్లపీతారుణవర్ణ రేఖాత్రయస్య లకార ప్రకృతిక పృథివ్యాత్మ కస్య, చతురస్రస్య ప్రవేశరీత్యా, ప్రథమరేఖాయాం** అంటూ ప్రథమరేఖలోకి ప్రవేశిస్తున్నాము. ఈ రేఖలో అణిమాది అష్టసిద్ధులు దేవతలరూపంలో ఉంటాయి.

**ప్రథమరేఖ :**

**నిధివాహన సమారూఢా వరదాభయ కరాంబుజా ।**
**పద్మరాగ ప్రతీకాశాః ప్రసీదత్వం అణిమాదయః ॥**

ఈ రేఖలో అణిమాది అష్టసిద్ధులు ఉంటాయి. అవి

**గరిమాణం లఘిమాణం వశిత్వ మణి మహి మానౌ ।**
**ప్రాకామ్యం భక్త్వాహం వందే ప్రాప్తి చ సర్వకామ్యదమ్ ॥**

సాధకుని కోరికలు తీర్చుటానికి ఇవి ఉపయోగపడతాయి.

1. అణిమాసిద్ధి - శరీరాన్ని అతిచిన్నదిగా చెయ్యటం
2. మహిమాసిద్ధి - శరీరము అతిపెద్దదిగా చెయ్యటం
3. గరిమాసిద్ధి - శరీరం బరువు విపరీతంగా పెంచటం
4. లఘిమాసిద్ధి - శరీరాన్ని అతితేలికగా చెయ్యటం
5. ప్రాప్తిసిద్ధి - కావలసిన వస్తువులు పొందటం
6. ప్రాకామ్యసిద్ధి - ఆకాశ గమనము
7. ఈశిత్వసిద్ధి - సమస్తముపై అధికారము పొందటం
8. వశిత్వసిద్ధి - అన్ని భూతాలను లోబరచుకోవటం

భూపురంలోని ఈ ప్రథమావరణము అర్చించినట్లైతే పైన చెప్పిన ఫలితాలు వస్తాయి. వీటినే అష్టసిద్ధులు అంటారు.

**ద్వితీయరేఖ :** ఇక రెండవరేఖలో చూసినట్లైతే

**చతుర్భుజా స్త్రినయనాః పద్మశూలాది హేతయః ।**

**విచిత్రాభరణాదేవ్యః ప్రసీదం త్వమష్టమాతరః ॥**

ఇక్కడ నాలుగు భుజములు, మూడు కనులు కలిగి, పద్మము, శూలము మొ॥ ఆయుధములు, చిత్రవిచిత్రమైన ఆభరణములు ధరించి అష్టమాతృకలు ఉంటారు. వారు

**బ్రాహ్మీ మాహేశ్వరి కౌమారీ వైష్ణవీ వారాహీ ।**

**మాహేంద్రీ చాముందా శ్రీమహాలక్ష్మిః పాందూ ద్వితీయభూగృహా ॥**

| | | | |
|---|---|---|---|
| 1. | బ్రాహ్మి | – | బ్రహ్మ యొక్క శక్తి |
| 2. | మహేశ్వరి | – | ఈశ్వరుని శక్తి |
| 3. | కౌమారి | – | కుమారస్వామి శక్తి |
| 4. | వైష్ణవి | – | విష్ణుమూర్తి శక్తి |
| 5. | వారాహి | – | వరాహరూపుని శక్తి |
| 6. | మాహేంద్రి | – | ఇంద్రుని శక్తి |
| 7. | చాముండ | – | చండముండులను వధించిన శక్తి |
| 8. | మహాలక్ష్మి | – | లక్ష్మీదేవి శక్తి |

**తృతీయ రేఖ :** ఈ రేఖలో ముద్రాదేవతలుంటారు.

**ముద్రాదేవ్యః ప్రసీదంతు వరాభయ కరాంబుజాః ।**

**భక్తాను గ్రహసంధాన దేవతామోద హేతవః ॥**

ఈ రేఖలో వరద అభయ ముద్రలు ధరించి భక్తులను అనుగ్రహించేటటువంటి

**సర్వసంక్షోభిణి, సర్వవిద్రావిణి, సర్వాకర్షిణి, సర్వ**

**వశంకరి, సర్వోన్మాదిని, సర్వమహాంకుశే, సర్వఖేచరి ।**

**సర్వబీజే, సర్వయోని, సర్వత్రిఖండే**

**ఏతాః ప్రకటయోగిన్యః త్రిపురా చక్రనాయకా ॥**

అనబడే పది శక్తులుంటాయి. ఇక్కడ ఉండే యోగిని పేరు ప్రకటయోగిని. ఈ ఆవరణకు అధిదేవత 'త్రిపుర'.

**2. ద్వితీయావరణ :** ఇది సర్వాశాపరిపూరకచక్రము. 16 దళాలు గల పద్మము. చంద్రకళా స్వరూపము. సకార ప్రకృతికము. దీని 16 దళాలలోను చంద్రుని యొక్క 16 కళలు ఉంటాయి. చంద్రుని యొక్క కళలు 16.

**ప్రతిపన్నామ విజ్ఞేయా చంద్రస్య ప్రథమాకళా ।**
**ద్వితీయాద్యా ద్వితీయాద్యా పక్షయో శుక్లకృష్ణయోః ॥**

పాడ్యమి నుండి పూర్ణిమ వరకు తిథులు 15. ఈ రకంగా శుక్లకృష్ణ పక్షాలయందు ఉంటాయి. అయితే

**దర్శాద్యా : పూర్ణిమాంతస్తు కళా పంచద శైవతు ।**
**షోడశీతు కళాజ్ఞేయా సచ్చిదానంద రూపిణీ ॥**

ధర్శ అంటే పాడ్యమి నుండి పౌర్ణమి వరకు తిథులు 15 కాగా 16వ కళ సచ్చిదానందరూపిణి అయి ఉన్నది. తిథులు నిత్యాస్వరూపాలు, నిత్యలు కళాస్వరూపాలు. ఈ ఆవరణలో చంద్రునియొక్క కళలు 16 ఆకర్షణ దేవతల రూపంలో ఉంటాయి. అవి.

| | | | |
|---|---|---|---|
| 1. | కామాకర్షిణి | 9. | చిత్తాకర్షిణి |
| 2. | బుద్ధ్యాకర్షిణి | 10. | ధైర్యాకర్షిణి |
| 3. | అహంకారాకర్షిణి | 11. | స్మృత్యాకర్షిణి |
| 4. | శబ్దాకర్షిణి | 12. | నామాకర్షిణి |
| 5. | స్పర్శాకర్షిణి | 13. | బీజాకర్షిణి |
| 6. | రూపాకర్షిణి | 14. | ఆత్మాకర్షిణి |
| 7. | రసాకర్షిణి | 15. | అమృతాకర్షిణి |
| 8. | గంధాకర్షిణి | 16. | శరీరాకర్షిణి |

వీరందరూ అకారాది స్వరూపంలో అ నుంచి అః వరకు 16 దళాలలోనూ ఉంటారు.

**ఏతాస్తు గుప్తయోగిన్యః త్రిపురేశీ పదాంతికే ।**

ఈ ఆవరణకు అధిదేవత త్రిపురేశి. ఇక్కడ ఉండే యోగినిపేరు గుప్తయోగిని.

**3. తృతీయావరణ :** ఇది సర్వసంక్షోభణ చక్రము. ఎనిమిది దళాలు గల పద్మము. అష్టమూర్త్యాత్మకము. హకారప్రకృతికము. దీనిలోని 8 దళాలయందు అనంగకుసుమ మొదలైన దేవతలు కచటతపయశళ అనే 8 వర్గులతో ఉంటారు. ఆ దేవతలు వరుసగా

1. అనంగకుసుమా
2. అనంగమేఖలా
3. అనంగమదనా
4. అనంగమదనాతురా
5. అనంగరేఖా
6. అనంగవేగిని
7. అనంగాంకుశ
8. అనంగమాలిని

**ఏతాస్తు గుప్తతరాభిఖ్యా త్రిపురసుందరి పదాంతికే ।**

ఇక్కడ ఉండే యోగిని పేరు గుప్తతరయోగిని. ఈ ఆవరణకు ఆదిదేవత త్రిపురసుందరి.

**4. చతుర్థావరణ :** ఇది సర్వసౌభాగ్యదాయక చక్రము. చతుర్దశారము 14 కోణాలు గల చక్రము. ఇప్పటిదాకా శివచక్రాలు చెప్పటం జరిగింది. ఇక శక్తిచక్రాలను వివరిస్తున్నారు. ఇందులోని 14 కోణాలు చతుర్దశ భువనాలకు ప్రతీక. ఈ కారప్రకృతికము. ఈ ఆవరణలో సర్వసంక్షోభిణీ మొదలైన శక్తులు క నుంచి ధ వరకు గల అక్షరములతో కలిసి 14 కోణాలయందు ఉంటాయి. అవి వరుసగా

**క్షోభిణ్యాద్యాః ప్రసీదంతు బాణకార్ముక పాణయః ।**
**సర్వాభరణ సంపన్నాః పృథురుకర్మ సురోచిషః ॥**

1. సర్వసంక్షోభిణీ
2. సర్వవిద్రావిణీ
3. సర్వాకర్షిణీ
4. సర్వాహ్లాదినీ
5. సర్వసమ్మోహిని
6. సర్వస్తంభిని
7. సర్వజృంభిణి
8. సర్వవశంకరి
9. సర్వరంజని
10. సర్వోన్మాదిని
11. సర్వార్ధసాధిని
12. సర్వసంపత్తిపూరిణి
13. సర్వమంత్రమయి
14. సర్వద్వంద్వక్షయంకరి

ఈ చక్రానికి అధిదేవత త్రిపురవాసిని. ఇక్కడ ఉండే యోగిని పేరు సంప్రదాయ యోగిని.

**5. పంచమావరణ :** ఇది సర్వార్ధసాధకచక్రము. 10 కోణములు గల చక్రము. బహిర్దశారము, దశావతారాత్మకము, ఏకారప్రకృతికము.

**దశదేవ్యః ప్రసీదంతు సర్వసిద్ధి ప్రదాదికాః ।**
**రక్తా స్సు పుష్పహారాఢ్యా వరదాభయపాణయః ॥**

ఇక్కడ సర్వసిద్ధిప్రదా మొదలైన 10 మంది దేవతలు ఎర్రని పూలమాలలు ధరించి వరద అభయ ముద్రలు గల హస్తములతో ఉంటారు. వారందరూ ఞ నుంచి భ వరకు అక్షరరూపంలో ఉంటారు.

1. సర్వసిద్ధిప్రద
2. సర్వసంపత్ప్రద
3. సర్వప్రియంకరి
4. సర్వమంగళకారిణి
5. సర్వకామప్రద
6. సర్వదుఃఖవిమోచని
7. సర్వమృత్యుప్రశమని
8. సర్వవిఘ్ననివారిణి
9. సర్వాంగసుందరి
10. సర్వసౌభాగ్యదాయిని

**ఏతాదేవ్యాః కుళోత్తీర్ణా, త్రిపురాశ్రీ చక్రనాయికా ।**

ఇక్కడ ఉండే యోగిని పేరు కుళోత్తీర్ణ యోగిని ఈ ఆవరణకు అధిదేవత త్రిపురాశ్రీ.

**6. షష్టావరణ :** ఇది సర్వరక్షాకర చక్రము. 10 కోణములు గల చక్రము. అంతర్దశారము. ఇది రకారప్రకృతికము. దశకళాత్మకము. అగ్ని యొక్క కళలు 10, ఈ ఆవరణలోని 10 కోణాలయందు ఉంటాయి.

**సుప్రసీదంతు దేవ్యశ్చ పుస్తకాక్షాది పాణయః ।**
**శుద్ధస్పటిక సంకాసా సర్వజ్ఞాద్యాశ్చ దేవతాః ॥**

పుస్తకము, అక్షమాల చేతులయందు ధరించి శుద్ధస్పటికము వలె ప్రకాశించేటటువంటి సర్వజ్ఞ మొదలైన దేవతలు మ నుంచి క్ష వరకు అక్షరరూపంలో ఉంటారు. వారు

1. సర్వజ్ఞే
2. సర్వశక్తి
3. సర్వైశ్వర్యప్రదాయిని
4. సర్వజ్ఞానమయి
5. సర్వవ్యాధివినాశిని
6. సర్వాధారస్వరూపా
7. సర్వపాపహరా
8. సర్వానందమయీ
9. సర్వరక్షాస్వరూపిణి
10. సర్వేప్సితఫలప్రదా

ఈ ఆవరణకు అధిదేవత త్రిపురమాలిని. ఇక్కడ ఉండే యోగిని పేరు నిగర్భయోగిని.

**7. సప్తమావరణ :** ఇది సర్వరోగహర చక్రము. అష్టకోణము. కకారప్రకృతికము. అష్టమూర్త్యాత్మకము. దీనిలోని 8 కోణాలయందు అష్టవసువులు వాగ్దేవతలరూపంలో ఉంటారు.

**వాగ్దేవతాః ప్రసీదంతు సింధూర కనకాంబరా ।**

**పుస్తకాక్షాదివిలసత్ వరదాభయ పాణయః ॥**

ఇక్కడ వాగ్దేవతలు సింధూరము కనకాంబరము వర్ణముతో కలిసిన వస్త్రములు ధరించి చేతులయందు పుస్తకము అక్షమాలలతో వరద అభయముద్రలు ధరించి ఉంటారు. ఆ దేవతలు వరుసగా అకచటతపయశ వర్గులుగా ఉంటారు.

1. వశిని
2. కామేశ్వరి
3. మోదిని
4. విమలా
5. అరుణ
6. జయ
7. సర్వేశ్వరి
8. కౌళిని

ఇక్కడ ఉండే యోగిని పేరు రహస్యయోగిని. ఈ అవరణకు అధిదేవత త్రిపురాసిద్ధాంబ.

**8. అష్టమావరణ :** ఇది సర్వసిద్ధిప్రద చక్రము. త్రికోణము, త్రిగుణాత్మకము. ఇక్కడ కామేశ్వరి వజ్రేశ్వరి భగమాలిని అనే దేవతలు ఆయుధబీజసంయుతలై ఉంటారు.

**రక్తవర్ణా రక్తభూషా వరదాభయ పాణయః ।**

**సాయుధా మకుటోపేతా ధ్యాయేద్యాయుధదేవతా ॥**

వీరందరూ ఎర్రని వర్ణముతో, ఎర్రని వస్త్రములు ధరించి చేతులయందు వరద అభయముద్రలతో సాయుధులై ఉంటారు.

ఇక్కడ ఉండే యోగిని పేరు అతిరహస్యయోగిని. ఈ ఆవరణకు అధిదేవత త్రిపురాంబ.

**9. నవమావరణ:** ఇది సర్వానందమయ చక్రము. బిందు రూపము. అదే పరబ్రహ్మ స్వరూపము. ఇక్కడ శివశక్తులు ఉంటారు. ఇక్కడ యోగిని పేరు పరాపర రహస్యయోగిని. ఈ ఆవరణకు అధిదేవత మహాత్రిపురసుందరి.

ఈ రకంగా శ్రీచక్రంలోని 9 ఆవరణలలోనూ అనేకమంది దేవతలున్నారు. వారిని గనక అర్చించినట్లైతే సాధకుని కోరికలు తీరతాయి. అందుకే

**ఆశానాంపూరకం చక్రం అర్చకానాం అహర్నిశం ।**

శ్రీచక్రాన్ని అర్చించేవారి కోరికలు ఆ పరదేవత సర్వకాల సర్వావస్థలయందు తీరుస్తుంటుంది అని చెప్పటం జరుగుతోంది.

# 10. శ్రీచక్ర పూజ

ఈ విధంగా నవావరణలలోనూ ఉన్న దేవతలను విడివిడిగా అర్చించటాన్నే "నవావరణార్చన" అంటారు. ఇదే శ్రీచక్రార్చన.

శ్రీచక్రానికి చేసే పూజ మూడువిధాలు. 1. సృష్టిపూజ, 2. స్థితిపూజ 3. సంహారపూజ

**1. సృష్టిపూజ :** బిందువు దగ్గర మొదలుపెట్టి భూపురం దాకా నవావరణలలోని దేవతలను అర్చించటం.

**2. సంహారపూజ :** భూపురం దగ్గర మొదలుపెట్టి బిందువు వరకు నవావరణలను అర్చించటము.

**3. స్థితిపూజ :** అష్టదళం దగ్గర మొదలుపెట్టి భూపురందాకా మూడు ఆవరణలను అర్చించి తరువాత చతుర్దశారము నుండి బిందువు దాకా ఆవరణలను అర్చించటం. ఈ మూడు పూజలు 3 ప్రస్తారాలమీద చెయ్యాలి. శ్రీవిద్యార్ణవ తంత్రంలో.

**భూప్రస్తారే మహేశాని స్థితి పూజా మహోత్తమా**

భూప్రస్తారం మీద స్థితిపూజ ఉత్తమమైనది.

**సంహారపూజ కైలాసప్రస్తారేత్ర విధేయతే**

**మేరుచక్రేతు సంహారక్రమపూజా నవిద్యతే**

**సృష్టిక్రమేణ దేవేసి పూజనీయ ప్రయత్నతః**

మేరువుకు సంహారక్రమంలో పూజ పనికిరాదు. మేరువుకు సృష్టిక్రమంలోనే పూజ చెయ్యాలి. శక్తిసంగమతంత్రంలో కూడా ఈ విషయం చెప్పబడింది.

**కైలాసంచ అర్ధమేరుకం సంహారాఖ్యం మహేశాని ।**

**మేరుచక్రే తు సంహార క్రమపూజాన విద్యతే ॥**

కైలాసప్రస్తారము అర్ధమేరువులందు మాత్రమే సంహారపూజ చెయ్యాలి. మేరువుకు సంహారపూజ చెయ్యరాదు. భక్తులు, ఉపాసనాపరులు ఈ విషయాన్ని గమనింతురుగాక.

## 11. పంచదశీ మహామంత్రము - శ్రీచక్రము

శ్రీవిద్యలో ఉన్నటువంటి మంత్రాలలో పంచదశి మహామంత్రము ప్రశస్తమైనది. గాయత్రిమంత్రము బ్రాహ్మణ క్షత్రియుల కోసం ఏర్పడగా మిగిలిన వర్ణాల వారికోసం పంచదశి మహామంత్రము ఏర్పడింది.

ఇది 15 అక్షరాలు గలిగిన మంత్రము. ఇది మొత్తం మూడుభాగాలుగా ఉంటుంది. ఈ భాగాలనే కూటములు అంటారు. వీటినే ఖండములు అనికూడా అంటారు. ఈ మంత్రానికి ప్రథమకూటమిలో 4, ద్వితీయ కూటమిలో 5, తృతీయ కూటమిలో 3, బీజాక్షరాలు ఉంటాయి. ప్రతికూటమి యందు చివర హ్రీంకారముంటుంది. ఈ రకంగా ఈ మంత్రానికి 12 + 3 = 15 అక్షరాలుంటాయి.

| | | |
|---|---|---|
| మొదటికూటమిలో | క ఏ ఈ ల | (వాగ్భవకూటమి) |
| రెండవకూటమిలో | హ స క హ ల | (కామరాజకూటమి) |
| మూడవకూటమిలో | స క ల | (శక్తికూటమి) |

అనే అక్షరాలుంటాయి. ఇవి హ్రీంకారముచే కలపబడుతుంటాయి. అప్పుడు మంత్రము క ఏ ఈ ల హ్రీం। హ స క హ ల హ్రీం। స క ల హ్రీం। అవుతుంది. ఈ మంత్రానికి అర్థం ఏమిటి ? దీనికి అధిదేవత ఎవరు ? అనే విషయం చూద్దాం. ఈ మంత్రంలో కొన్ని బీజాక్షరాలు పరమేశ్వరుడు చెప్పగా, కొన్ని పరమేశ్వరిచే చెప్పబడ్డాయి. మిగిలినవి ఉభయలచేత చెప్పబడ్డాయి.

**కత్రయం హద్వయంచైవ శైభాగః ప్రకీర్తితః ।**

కకారత్రయము, హకారద్వయము పరమేశ్వరుని చేత చెప్పబడ్డాయి.

**శక్త్యక్షరాణి శేషాణి, హ్రీంకార ముభయాత్మకః ।**

హ్రీంకారములు ఉభయాత్మకములు. కాగా మిగిలినవి. పరమేశ్వరిచేత చెప్పబడ్డాయి.

ఏ ఈ ల స ల స ల (7) అక్షరాలు శక్తి భాగాలు.

అంటే శక్త్యక్షరాలు 7 శివుని భాగాలు 5, ఉభయాత్మకములు - 3. వెరసి 15

**నతేషాం సిద్ధిదా విద్యా కల్పకోటిశతైరపి ।**

ఈ విషయం తెలియకుండా ఎన్ని కోట్ల సంవత్సరాలు జపం చేసినప్పటికీ మంత్రము సిద్ధించదు.

**యస్యనో పశ్చిమంజన్మ యదివా శంకరస్స్వయం ।**

**తేనైవ లభ్యతే విద్యా శ్రీమత్పంచదశాక్షరీ ॥**

శ్రీవిద్య సామాన్యమైనది కాదు - ఎవరికైతే మరుజన్మ ఉండదో, ఎవరు సాక్షాత్తూ పరమేశ్వస్వరూపుడో అతడే శ్రీవిద్యను ఉపాసించగలుగుతాడు.

అసలు ఈ మంత్రము ఏవిధంగా ఆవిర్భవించింది ?

**వ్యోమాదిజనక హకరసలవర్ణైర్ఘటనేన పంచభూతమయీ, పంచదశవర్ణాః**

పంచభూతాల యొక్క బీజాక్షరాలవల్లనే ఈ మంత్రము ఆవిర్భవించింది.

**హకారద్వ్యోమ సంభూతా కకారస్తు ప్రభంజనః**

**రేఫాదగ్నిః సకారశ్చ జలతత్త్వ సముద్భవః ।**

**లకారత్పృథివీజాతా, తస్మాద్విశ్వమయీచసా ॥**

| | | |
|---|---|---|
| ఆకాశము | - | హ |
| వాయువు | - | క |
| అగ్ని | - | ర |
| జలము | - | స |
| పృథివి (భూమి) | - | ల |

| | | |
|---|---|---|
| అంటే | హ కారము | ఆకాశ తత్త్వాత్మకము |
| | క కారము | వాయు తత్త్వాత్మకము |
| | ర కారము | అగ్ని తత్త్వాత్మకము |
| | స కారము | జల తత్త్వాత్మకము |
| | ల కారము | పృథ్వి తత్త్వాత్మకము |

ఈ రకంగా శ్రీవిద్య పంచభూతమయమైనది. సృష్టి జరిగినప్పుడు పంచభూతాలు ఆవిర్భవించినాయి.

| | | |
|---|---|---|
| **ఆకాశాద్వాయుః** | - | ఆకాశమునుంచి వాయువు |
| **వాయోరగ్నిః** | - | వాయువునుంచి అగ్ని |
| **అగ్నిర్ఆపః** | - | అగ్నినుంచి జలము |
| **ఆపఃపృథివీ** | - | జలము నుంచి భూమి ఉద్భవించాయి. |

ఈ రకంగా ఉద్భవించినప్పుడు పంచభూతాలు పంచీకరణం చెందినాయి. అప్పుడు

| | | |
|---|---|---|
| ఆకాశము | - | 5 భాగాలు |
| వాయువు | - | 4 భాగాలు |
| అగ్ని | - | 3 భాగాలు |
| జలము | - | 2 భాగాలు |
| భూమి | - | 1 భాగము |
| మొత్తం | - | 15 భాగాలు అయినాయి |

ఈ 15 భాగాలే పంచదశీ మహామంత్రంలోని 15 అక్షరాలు. ఇప్పుడు మంత్రంలో

| | | |
|---|---|---|
| ఆకాశ తత్త్వాత్మకము | హ కారము | 5 బీజాలు |
| వాయు తత్త్వాత్మకము | ఈ కారము | 4 బీజాలు |
| అగ్ని తత్త్వాత్మకము | ర కారము | 3 బీజాలు |
| జల తత్త్వాత్మకము | స కారము | 2 బీజాలు |
| పృథి వితత్త్వాత్మకము | ల కారము | 1 బీజము |
| వెరసి | | 15 బీజాలు |

అయితే వాయు బీజము కకారము. మంత్రంలో 3 కకారాలే ఉన్నాయి. అందుచేత ఈ కారము వాయు బీజంగా తీసుకోవాలి. అప్పుడు ఈ కారము మంత్రంలో విడిగా ఒకటి, మూడు హ్రీం కారముల యందు మూడు వెరసి 4 ఈ కారాలుంటాయి.

ఇక ఆ మంత్రానికి అధిష్టాన దేవత ఎవరు ?

పరబ్రహ్మ సృష్టి చెయ్యాలని సంకల్పించినవాడై తనను తాను రెండు భాగాలుగా విభజించుకున్నాడు. అవే ప్రకాశ విమర్శాంశలు. ప్రకాశాంశ పురుషుడు కాగా విమర్శాంశ స్త్రీ. ఇవే ప్రకృతి పురుషులు శివశక్తులు. సృష్టిచెయ్యటం కోసం వారు త్రిమూర్తిద్వంద్వాన్ని సృష్టించారు. వారే బ్రహ్మ, విష్ణు రుద్రులు - మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతులు వారి శక్తులు. వీటిలో త్రిమూర్తులనే వామ జ్యేష్ట రౌద్రి శక్తులని, త్రిశక్తులను ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులని అంటారు.

వామేచ్ఛా బ్రహ్మభారత్యౌ జ్యేష్టాజ్ఞాన హరిక్షితి ।
రౌద్రిక్రియా శివాపర్ణే ఇత్యేతన్మిధున త్రయమ్ ॥

బ్రహ్మ, సరస్వతి - వామా, ఇచ్ఛాశక్తులు

విష్ణువు, లక్ష్మి - జ్యేష్ఠ, జ్ఞాన శక్తులు

రుద్రుడు, గౌరి - రౌద్రి, క్రియా శక్తులు

ఇందులో వామజ్యేష్ఠారౌద్రి శక్తులు త్రిమూర్తులు. వీరు ముగ్గురినీ కలిపి సమిష్టిగా అంబిక అంటారు. అలాగే ఇచ్ఛాజ్ఞానక్రియా శక్తులు త్రిమూర్తుల యొక్క శక్తులు. ఈ మూడింటినీ కలిపి సమిష్టిగా శాంత అంటారు. ఈ రకంగా వీరంతా నాలుగు మిధునాలవుతున్నారు. పంచదశి మహామంత్రంలో మూడు కూటములున్నాయి. ప్రథమకూటమిలో

**కకారోఽబ్రహ్మరూపశ్చ ఏకారో భారతీమతమ్**

**ఈకారో విష్ణురూపశ్చ లకారో పృథ్వీమతమ్**

**హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్చతే ॥**

క కారము - బ్రహ్మ స్వరూపము

ఏ కారము - భారతి స్వరూపము

ఈ కారము - విష్ణు స్వరూపము

ల కారము - పృథివి స్వరూపము

హ్రీం కారములోని హ కారము - రుద్రుడు స్వరూపము

ర కారము - రుద్రాణి స్వరూపము

ద్వితీయ కూటమిలో మద్యన ఉన్న హకారాన్ని మూడవ కూటమికి ముందు చేర్చి లెక్కపట్టినట్లైతే రెండు మూడు కూటములయందు ఒకే అక్షరాలుంటాయి. అవి హ స క ల హ్రీం ఇప్పుడు

**హకారో బ్రహ్మరూపశ్చ సకారో భారతీమతమ్**

**కకారో విష్ణురూపశ్చ లకారో పృథివీ మతమ్**

**హకారో రుద్రరూపశ్చ రకారో రుద్రాణి ముచ్చతే ॥**

హ కారము - బ్రహ్మ స్వరూపము

స కారము - భారతి స్వరూపము

క కారము - విష్ణు స్వరూపము

| | | |
|---|---|---|
| ల కారము | - | పృథివి స్వరూపము |
| హ్రీం కారములోని హ కారము | - | రుద్రమ స్వరూపము |
| ర కారము | - | రుద్రాణి స్వరూపము |

ఈ విధంగా ప్రతికూటమిలోనూ త్రిమూర్తి ద్వంద్వమే అక్కడి అక్షరాలకు అర్ధము. మొత్తం మీద కనక చూసినట్లైతే పంచదశీ మహామంత్రము పంచ భూతాలనుండే ఆవిర్భవించిందని, ఆ మంత్రానికి అర్థం త్రిమూర్తులనీ తెలుస్తోంది. మరి ఆ మంత్రానికి అధిదేవత సాక్షాత్తూ పరమేశ్వరుడే.

అసలు శ్రీచక్రము పంచదశీ మహామంత్రం నుంచే ఆవిర్భవించింది అని 'వరివశ్యా రహస్యము' లో భాస్కరరాయలవారు అన్నారు. ఇదే విషయం జ్ఞానార్ణవతంత్రంలో కూడా చెప్పబడింది. పంచదశి మహామంత్రంలో బీజాక్షరాలను ఒకసారి లెక్కపెట్టిన దానిని మళ్ళీ లెక్కించకుండా అంటే పునరావృత్తి లేకుండా లెక్కపెడితే 9 అక్షరాలే వస్తాయి. ఆ 9 బీజాక్షరాలవల్లనే శ్రీచక్రం ఏర్పడింది.

**భూమిశ్చంద్రశివోమాయా శక్తిః కృష్ణమాదనౌ ।**

**అర్ధచంద్రశ్చ బిందుశ్చ నవార్ణో మేరు రుచ్యతే ॥**

| | | | |
|---|---|---|---|
| ఇందులో | 1. భూమి | - | ల కారము |
| | 2. చంద్ర | - | స కారము |
| | 3. శివ | - | హ కారము |
| | 4. మాయా | - | ఈ కారము |
| | 5. శక్తి | - | ఏ కారము |
| | 6. కృష్ణమాద్య | - | రే ఫ |
| | 7. మాదన | - | క కారము |
| | 8. అర్ధచంద్ర | - | నాదము |
| | 9. బిందు | - | బిందువు |

ఈ 9 అక్షరముల సముదాయమే పంచదశి మహామంత్రము. దానినుంచే శ్రీచక్రం ఆవిర్భవించింది. ముందుగా

1. ల కారము పృధివీ బీజము. దీనివల్ల భూపురం పుట్టింది.

2. స కారము చంద్రబీజము దీనివల్ల షోడశకళలుండే షోడశదళము పుట్టింది.

3. హ కారము శివబీజము అష్టమూర్త్యాత్మకము. దీనివల్ల అష్టదళము పుట్టింది.

4. ఈ కారము మాయాబీజము. అందుచేత చతుర్దశభువనాత్మకమైన చతుర్దశారము దీనివల్ల పుట్టింది.

5. ఏ కారము శక్తిబీజము. దీనివల్ల దశావతారాలకు ప్రతీకగా బహిర్దశారము పుట్టింది.

6. ర కారము అగ్నిబీజము. దీనివల్ల అగ్ని కళలతో కూడిన అంతర్దశారము పుట్టింది.

7. క కారము మన్మధ బీజము. వసుకోణాత్మకము. దీనివల్ల వసుకోణము పుట్టింది.

8. అర్థచంద్రము. త్రిగుణాత్మకము. దీనివల్ల త్రికోణం పుట్టింది.

9. బిందువు పరబ్రహ్మాత్మకము. దీనినుంచి పరబ్రహ్మాత్మకమైన బిందువు పుట్టింది.

ఈ రకంగా పంచదశీ మహామంత్రం నుంచే శ్రీచక్రము పుట్టింది. మరి పంచదశి మహామంత్రానికి ఆదిదేవత త్రిమూర్తి ద్వంద్వము, పరమేశ్వర స్వరూపము అయినప్పుడు శ్రీచక్రానికి ఆదిదేవత కూడా ఆ పరమేశ్వర స్వరూపమే కదా.

## 12. పరమేశ్వరి పూజాఫలము

భగవంతుణ్ణి ఆరాధించేవారు రెండు రకాలుగా ఉంటారు. 1. లౌకికవాదులు 2. పారలౌకికులు. లౌకికవాదులు అంటే ఈ లోకంలో పొందే సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు, ఉన్నతపదవులు ఆశించేవారు. వీరిదృష్టిలో శ్రీచక్రంలో ఉండే పరమేశ్వరి సాకార అంటే ఒక ఆకారము కలిగినటువంటిది.

**చతుర్భుజే చంద్రకళావతంసే కుచోన్నతే కుంకుమ రాగశోణే ।**
**పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే ॥**

ఆమె 4 భుజముల యందు పాశము, అంకుశము, ఇక్షుచాపము, పుష్పబాణాలు ధరించి ఉంటుంది. కొంతమంది దృష్టిలో ఆ దేవి దశభుజ, గౌపాదులవారు ఆ దేవిని స్తుతి చేస్తూ

భవాని శ్రీహస్తైఃర్వహసి ఫణిపాశం సృణి మథో
దనుః పౌండ్రం పౌష్పం శరమథ జపస్రక్శుకవరౌ ।
అథద్వాభ్యాం ముద్రామభయ వరదానైక రసికాం
క్వణద్వీణాం ద్వాభ్యాం త్వమురసి కరాభ్యాం చ బిభృషే ॥

చేతులయందు సర్పరూపపాశము, 2 అంకుశము 3 పుండ్రేక్షు చాపము, 4 పుష్పబాణము 5. జపమాల, 6. శుకవరము 7,8 వరదఅభయముద్రలు 9,10 చేతులయందు వీణ ధరించి పది బావులతో ఉంటుంది.

ఈ విధంగా ప్రకాశించే పరమేశ్వరిని గనక ఆరాధించినట్లైతే సాధకుడికి ముల్లోకాలను రంజింపచేసే కవిత్వము, ధనధాన్యాలు, భోగభాగ్యాలు లభిస్తాయి. ఈ విధంగా లౌకికవాదుల కోరికలు తీరతాయి.

ఇక పార లౌకిక లేక మోక్షవాదులను గనక చూసినట్లైతే, వారికి కావలసినది ఇహంకాదు పరం. అంటే సాయుజ్యం. శ్రీచక్రంలో ఉన్న ఒక్కొక్క ఆవరణ, జగత్తులోని ఒక్కొక్క దానికి గుర్తు.

| | | |
|---|---|---|
| భూపురం | - | భూలోక భువర్లోక సువర్లోకాలకు |
| షోడశదళం | - | చంద్రకళలు |
| అష్టదళం | - | అష్టమూర్తులు |
| చతర్దశారం | - | చతుర్దశ భువనాలు |
| బహిర్దశారం | - | దశావతారాలు |
| అంతర్దశారం | - | అగ్నికళలు |
| అష్టకోణం | - | అష్టవసువులు |
| త్రికోణం | - | త్రిమూర్తులు, త్రిశక్తులు, త్రిగుణాలు, షోడశనిత్యలు, పంచదశ తిధులు, అ నుంచి క్ష వరకు అక్షరాలు ఈ రకంగా అన్నీ ఇక్కడే ఉన్నాయి. జగత్తంతా ఈ త్రికోణంలోనే ఉంది. |
| బిందువు | - | పరమేశ్వర స్వరూపం. నిరాకారుడు నిర్గుణ స్వరూపుడు అయిన పరబ్రహ్మ బిందురూపంలోనే ఉన్నాడు. అదే ఈ బిందువు. తేజోమయమైన కాంతి పుంజము. |

ఈ రకంగా ఉన్న శ్రీచక్రాన్ని అర్చించినట్లైతే చరాచర జగత్తును అర్చించినట్లే. విశ్వమానవాళినంతటినీ అర్చించినట్లే. జగత్తులోని ప్రాణికోటినంతటినీ అర్చించినట్లే.

మోక్షవాదులకు బాహ్యపూజలేదు. వారు శ్రీచక్రాన్ని తమ శరీరంలోనే ఊహించుకుని అంతరారాధన చేస్తారు. వీరు తమ శరీరంలో బిందువు అంటే బ్రహ్మరంధ్రం దగ్గర పరమేశ్వరి సాక్షాత్కారం పొందుతారు. సాధకుడు, పరమేశ్వరి ఇద్దరూ ఒక్కటే. వేరు కాదు అని తెలుసుకుంటారు. ఇదే ఆత్మసాక్షాత్కారము. ఈ విధంగా ఆత్మసాక్షాత్కారం పొందిన వారికి సాయుజ్యం లభిస్తుంది. మోక్షం సిద్ధిస్తుంది. వారి ఆత్మపరమాత్మలో లీనమైపోతుంది. వారికి మరుజన్మ ఉండదు.

**యత్రాపి భోగో నచ తత్ర మోక్షః యత్రాపి మోక్షో నచ తత్ర భోగః ।**
**శ్రీ సుందరీ సేవన తత్పరాణాం భోగశ్చ మోక్షశ్చ కరస్తఏవ ॥**

లోకంలో భోగభోగ్యాలు అనుభవించే వారికి మోక్షము లభించదు. అలాగే మోక్షగాములకు సిరిసందలుండవు. కాని ఆ పరమేశ్వరిని అర్చించేవారికి ఇహము, పరము రెండూ లభిస్తాయి.

హరితస గోత్రీకుడు, శ్రీక్రోవి కృష్ణమూర్తి శ్రీమతి సత్య పర్వతవర్ధనమ్మ గార్ల
జ్యేష్టపుత్రుడు అయిన క్రోవి పార్థసారథి.
సర్వజనామోదము పొందునట్లుగా సులభశైలిలో వ్రాసిన
**శ్రీచక్రము** అను ఈ చిన్న పుస్తకము సమాప్తము.
ఓంతత్సత్

ఈ గ్రంథాన్ని Internet లో
http : // www. geocities.com/srividyabooks లో చూడగలరు.